క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



దాతలకు బాండ్‌లు అందిస్తున్న దేవస్థానం ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ముగ్గురు దాతలు చెరో రూ.లక్ష చొప్పున రూ.3 లక్షల విరాళమిచ్చారు. విశాఖలోని సాగర్‌నగర్‌కు చెందిన కొల్లి శివకాంత్, ముంబైకి చెందిన పీయూష్ రఘువన్షి, అభినవ్ చతుర్వేదిలు ఒక్కొక్కరు ఒక్కో రూ.లక్ష చొప్పున ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతలకు అన్నప్రసాద విభాగంలో ఏఈవో పి.శ్రీనివాసరావు బాండ్‌లు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సునీల్, సీనియర్ అసిస్టెంట్ దొంతల రమణ పాల్గొన్నారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి, ప్రసాదం అందజేశారు.

బాల్య వివాహాల నియంత్రణకు కృషి



నూతనంగా నియమితులైన బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు

పరవాడ: బాల్య వివాహాలను అరికట్టడానికి బాలల సంక్షేమ రక్షణ కమిటీప్రతినిధులు కృషి చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ బాలల పరిరక్షణ కమిటీ ప్రతినిధి పి.లక్ష్మి సూచించారు. మండలంలోని కన్నూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టి డ్రాపౌట్స్‌ను గుర్తించి వారిని పాఠశాలలకు పంపడం, ట్రాఫింగ్, పోక్సో యాక్ట్‌ల గురించి వివరించారు. 11–17 ఏళ్ల వయస్సున్న కిశోర బాలికల్లో శారీరకంగా వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. గ్రామ సచివాలయ మహిళా పోలీస్ డి.స్వరూప ఆధ్వర్యంలో బాలల సంక్షేమ రక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. గ్రామ సభలో కమిటీ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 9 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున రూ.90 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

విశాఖ విద్య: రాష్ట్రస్థాయిలో సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ భారత్–2025 క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఏలూరు జిల్లా నూజివీడు మండలం ఆగిరిపల్లి హిల్ పారడైజ్ స్కూల్‌లో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటి పలు పతకాలు సాధించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీరిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ అభినందించారు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖరరావు, సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలి

ఉక్కునగరం: ఉక్కు రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ నుంచి స్ట్రాటజిక్ రంగంలోకి మార్చాలని నేషనల్ కాన్ఫడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీవోఏ) తీర్మానించిందని విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్ తెలిపారు. మనాలిలో జరిగిన ఎన్‌సీవోఏ నేషనల్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్‌లతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల అధికారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్, నగర్‌నార్ ప్లాంట్, డిజైన్ సంస్థ మెకాన్, మైనింగ్ సంస్థ కేఐవోసీఎల్‌లను విలీనంచేసి ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని తీర్మానించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచినట్లే పీఎస్‌యూ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ. 25 లక్షలకు పెంచాలని, సమర్థులైన చైర్మన్లు, డైరెక్టర్లను నియమించాలని తీర్మానాలు చేశారు. ఎన్‌సీవోఏ అధ్యక్షుడు ఆడాసుల్, సెక్రటరీ జనరల్ అనిల్‌కుమార్, చైర్మన్ తోమర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులపై గుదిబండ





పెరిగిన గ్యాస్ ధరలపై ఇటీవల నిరసన తెలిపిన సీపీఐ కార్యకర్తలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సామాన్యుల బతుకులు దుర్భరమయ్యాయి. నింగినంటిన నిత్యావసర సరకుల ధరలకు తోడు పెరిగిన విద్యుత్ చార్జీలతో భయపడే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధరను కూడా పెంచడంతో మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తమ బతుకులు మారాయని పేద, మధ్యతరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. తాజా పెంపుతో ఒక్క పరవాడ మండల వినియోగదారులపైనే ప్రతి నెలా దాదాపు రూ.4 లక్షల భారం పడుతోంది.

పరవాడ: ఎన్నికల ముందు కూటమి పార్టీల నేతల మాటలకు.. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం చేస్తున్నదానికి ఎలాంటి పొంతన లేదు. గత ప్రభుత్వంలో అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన స్థాయిలోనే మన రాష్ట్రంలో ఏ వస్తువు ధర పెరిగినా అప్పటి విపక్ష పార్టీలుగా గగ్గోలు పెట్టేవారు. తీరా వారు అధికారంలోకి వచ్చాక అంతర్జాతీయ పరిణామాలతో సంబంధం లేకుండానే రాష్ట్రంలో ఇష్టారీతిన ధరలు పెంచేస్తున్నారు. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆకాశాన్ని అంటిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇప్పటికే కునారిల్లుతున్న పేదల బతుకుల్ని కరెంట్ చార్జీలు ఇబ్బంది పెట్టాయి. ఇప్పుడు పెంచిన వంట గ్యాస్ ధరలు మరింత కుంగదీస్తున్నాయి. దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని విపక్ష పార్టీలు గగ్గోలు పెడుతున్నా కూటమి పెద్దలు పట్టించుకోవట్లేదు.

ప్రతి నెలా భారం రూ.4 లక్షలు

ప్రభుత్వం 14.2 కిలోల గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనంగా పెంచింది. పరవాడ మండలంలో 8 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. ప్రతి నెలా అటూఇటుగా మండల ప్రజలపై రూ.4 లక్షల భారం పడుతోంది. దీనికి డెలివరీ బాయ్‌ల వసూళ్లు అదనం. గతంలో రూ.811 ఉన్నప్పుడే రూ.850 వరకు చెల్లించాల్సి వచ్చేదని ప్రజలు చెప్తున్నారు. ఇప్పుడు తాజా పెంపుతో రూ.900 వరకు చేతి చమురు వదులుతుందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చే ఉచిత గ్యాస్ సిలెండర్ల మిగులు ఎటూకాకుండా పోయిందని ఆక్షేపిస్తున్నారు.

సంక్షేమాన్ని మరిచి అదనపు భారం

గృహ అవసరాలకు ఉపయోగించే గ్యాస్ ధరలను పెంచడంతో గ్రామీణ మహిళలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికీ సంక్షేమ లబ్ధి లభించేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను పక్కన పెట్టి వివిధ రకాల వస్తువులపై ధరలు పెంచడాన్ని ఆక్షేపిస్తున్నారు. పేద ప్రజలపై అదనపు భారం మోపడంతో ఆయా వర్గాల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ధరలను అదుపు చేయాల్సిన ప్రభుత్వం అది చేయకపోగా.. అదనపు భారాలు వేయడమేంటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మినీ వ్యాన్‌లో గ్యాస్ బండలను ఇంటింటికీ సరఫరా చేస్తున్న సిబ్బంది

గ్యాస్ ధర(తాజా పెంపుతో)	రూ.860
మండలంలో దీపం, సీఎస్సార్ కనెక్షన్లు	7 వేలు
రెగ్యులర్ కనెక్షన్లు	3 వేలు
కమర్షియల్ కనెక్షన్లు	100

దివంగత మహానేత హయాంలో..



దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో యూపీఏ ప్రభుత్వం వంట గ్యాస్ ధరను రూ.50 పెంచింది. అయితే ఆ భారం రాష్ట్ర ప్రజలపై లేకుండా వైఎస్సార్ ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకుంది. ఆయన అధికారంలో ఉన్నన్నాళ్లు ఏ ఒక్క గ్యాస్ వినియోగదారుడూ అదనపు చెల్లింపులు చేయాల్సిన పరిస్థితి రాలేదు. ప్రభుత్వం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మాత్రం ప్రతి భారాన్నీ ప్రజలపై వేస్తూ, అదనపు వడ్డింపులు చేసేందుకూ వెనుకాడట్లేదు.

పెంచిన ధరలను తగ్గించాలి



ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను అదుపు చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మహిళలను ప్రభుత్వం మోసం చేసింది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా మహిళా సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఓ పక్క నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. కరెంటు చార్జీలు పెరిగిపోయాయి. ఇప్పుడు మళ్లీ గ్యాస్ సిలిండర్‌పై అదనంగా రూ.50 పెంచడం అన్యాయం. గ్యాస్ ధరలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి.

– మాకిరెడ్డి రమణమ్మ, వెన్నలపాలెం

గ్యాస్ ధరల పెంపు అన్యాయం



పెరిగిన వంట గ్యాస్ ధరలతో మాలాంటి పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం పడింది. కూలీనాలీ చేసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్న మధ్య తరగతి కుటుంబాలపై ఈ ప్రభుత్వంలో అన్ని విధాలా భారం పడుతోంది. నిత్యావసర వస్తువుల ధరల్ని తలచుకుంటే భయమేస్తోంది. కరెంటు, గ్యాస్ సిలిండర్లపై అదనపు ధరలు వసూలు చేయడం వల్ల మరింత నలిగిపోతున్నాం. పెంచిన గ్యాస్ ధరలతో గ్యాస్ సిలిండర్ బుక్ చేసేందుకు వెనుకాడే పరిస్థితి.

– బంగారమ్మ, గృహిణి, గొర్లివానిపాలెం

పేదలపై అదనపు భారం తగదు



ఎన్నికల ముందు ధరలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అన్ని రకాల వస్తువులపై ధరలు పెంచి సామాన్యులను దగా చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో కూలి పనులకు దొరక్క ఆర్థిక ఇబ్బందులతో ప్రజలు సతమతమవుతున్నారు. ఈ తరుణంలో కరెంటు, నిత్యావసర వస్తువుల ధరలతో పాటు గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజలపై అదనపు భారం మోపడం అన్యాయం. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు, సిటు

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీకి పునర్వైభవం



గుడివాడను మర్యాదపూర్వకంగా కలిసిన పరవాడ వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: పార్టీలో నాయకులు అందరు కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ నూతన అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడను పరవాడ ప్రాంత వైఎస్సార్‌సీపీ నేతలు మిందిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి దుశ్శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ కూటమి నేతలు అనుసరిస్తున్న అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరిని పార్టీలో గుర్తింపు దక్కుతుందన్నారు. పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు మాట్లాడుతూ అమర్‌నాథ్ నియామకంతో పార్టీకి జిల్లాలో పూర్వవైభవం వస్తుందన్నారు. గుడివాడను కలిసిన వారిలో మండల వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, భర్నికం సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ మాజీ డైరెక్టర్ దలాయి నదియా, కన్నూరు సర్పంచ్ గొల్లవిల్లి శ్రీను కృష్ణవేణి, మాజీ మండల అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు, బండారు శ్రీను ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులే పునర్నిర్మించాలి

- ఆక్సిజన్ కాలనీలో ఆక్రమణదారులకు అధికారులే వత్తాసు పలుకుతున్నారు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాలు, కాలనీవాసుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పీవోడబ్ల్యూ, ఇఫ్టూ నేతలు, ఆక్సిజన్ కాలనీ ప్రతినిధులు

పెందుర్తి: సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తుంగలో తొక్కి చినముషిడివాడ సమీపంలోని ఆక్సిజన్ కాలనీలో ఉన్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులు తొలగించడం దుర్మార్గపు చర్య అని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, భీంసేన వార్ ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు ఆరోపించారు. తొలగించిన స్థానంలో తక్షణమే అంబేడ్కర్ విగ్రహాన్ని అధికారులే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆక్సిజన్ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఇటీవల తొలగించినందుకు నిరసనగా స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాసంఘాలు, కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆక్సిజన్ కాలనీలో ప్రభుత్వ భూమి దురాక్రమణకు పాల్పడుతున్న బుర్ర రాజేష్ అనే వ్యక్తికి రెవెన్యూ అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని ఆరోపించారు. కానీ అంబేడ్కర్‌పై ఉన్న అభిమానంతో ఆయన విగ్రహాన్ని పెడితే మాత్రం అధికారులకు ఎక్కడ లేని కోపం వస్తోందని మండిపడ్డారు. పైగా విగ్రహం తొలగింపులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారని ఆక్షేపించారు. విగ్రహాన్ని యథాస్థితిలో పెట్టేవరకు విశ్రమించబోమని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో శ్రీలేఖను కలిసి వినతిపత్రం అందించారు. ఈ వ్యవహారంపై తగిన నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. ఆందోళనలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, మురికివాడల నివాసితుల సంక్షేమ సంఘం నగర కో కన్వీనర్ రూప, ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ ప్రతినిధులు వనలత కుమారి, సందీప్, మణి, దీప తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న ఆర్జిత సేవలు పునఃప్రారంభం



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



స్వామికి తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై శుక్రవారం నుంచి ఆర్జిత సేవలు పునః ప్రారంభమయ్యాయి. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం పురస్కరించుకుని ఈ నెల 7 నుంచి 24వ తేదీ వరకు ఆర్జిత సేవలు నిలుపుదల చేసిన విషయం తెలిసిందే. కల్యాణోత్సవాలు విజయవంతంగా పూర్తి కావడంతో శుక్రవారం నుంచి తిరిగి ఆర్జిత సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి, ఉదయం 9.30 గంటల నుంచి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉభయదాతలకు స్వామి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే స్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఈ సేవ నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. అష్టోత్తర శత నామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతి ఇచ్చారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు



భెల్ ప్రధాన గేటు వద్ద సంతాపం తెలుపుతున్న ప్రోగ్రసివ్ ఫ్రంట్ నాయకులు

పహల్గాం అమరులకు సంతాపం

అక్కిరెడ్డిపాలెం: జమ్మూకశ్మీర్ పహల్గాంలో టూరిస్ట్‌లను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను క్షమించకూడదని బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈడుపుగంటి అనార్‌బాబు అన్నారు. పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి అసోసియేషన్ ప్రతినిధులు ఘన నివాళులర్పించి టౌన్ షిప్ నుంచి భెల్ సిగ్నల్ పాయింట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తమ ప్రఘాఢ సానుభూతి తెలిపారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉరుకూటి అప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు సంద్రాన నూకరాజు, ఈటి రంగారావు, ఉరుకూటి బాబూరావు, తేజ భాస్కరరావు, జమ్మురమణ కబడ్డీ కనకరాజు, సింహాచలం,సుధాకర్, చంటి రెడ్డి, గొలగాని రాంబాబు పాల్గొన్నారు.

● పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని ప్రతి ఒక్కరు రాజకీయాలకు అతీతంగా ఖండించాలని భెల్ (హెచ్‌పీవీపీ) సీటు నాయకులు జి.టి.పి.ప్రకాష్ అన్నారు. శుక్రవారం భెల్ ప్రధాన గేటు వద్ద ప్రోగ్రసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి జమ్మూ కశ్మీర్‌లో మంచి వాతావరణం తీసుకురావాలన్నారు. ఫ్రంట్ నాయకులు సీతన్‌నాయుడు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, కె.నారపురెడ్డి, సీహెచ్.మురళీశ్వరరావు, పి.కనకారావు, అల్లు అప్పారావు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని గాజువాక నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సీపీఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ 65వ వార్డు కాకతీయ ఆర్చ్ వద్ద శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రతి భారతీయుడు ఉగ్ర ఉన్మాదాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. అమాయక పర్యాటకుల ఉగ్రవాదుల దాడులు పిరికిపంద చర్య అన్నారు. ఇలాంటి దాడులను ఎట్టి పరిస్థితులో ఉపేక్షించకూడదన్నారు. దాడికి కారణమైన ఉగ్రవాదులను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆనంద్, అచ్యుతరావు, పోలయ్య, దుర్గారావు,



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

అప్పారావు, కె. వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

అమాయకులపై దాడులు శోచనీయం

గాజువాక: దేశ ప్రజల్లో భయాన్ని రేకెత్తించేందుకు ఉగ్రవాదులు అమాయక ప్రజలపై దాడులు చేయడం శోచనీయమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారి ఆత్మకు శాంతి చేకూరాలని మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి మానవత్వాన్ని మరిచిపోయిన క్రూర చర్య అని అన్నారు. విహారయాత్రకు వెళ్లిన పౌరులపై దాడి జరగడం బాధాకరమన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



వాడచీపురుపల్లి ర్యాలీలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

పరవాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి జయశ్రీ కరిష్మా అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిసరాల పరిశుభ్రతపై పరవాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది శుక్రవారం అవగాహన సదస్సులు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల వద్ద మురుగు నీరు నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ తదితర వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఇంటి పరిసరాల్లో పారేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, పనికి రాని సామాన్లను ఎప్పటికప్పుడు తొలగించి, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్.సాయిరాం, పీహెచ్‌ఎన్ జానకీ రామన్, హెచ్‌వీ పి.రత్నం, స్టాఫ్ నర్స్ రాజేశ్వరి, ఫార్మసిస్ట్ విజయ్‌కుమారి, అన్నపూర్ణేశ్వరి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కనకప్పారావు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ, అవగాహన సదస్సులు నిర్వహించి మలేరియా వ్యాప్తికి కారణాలు, నివారణ చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరు మలేరియా నివారణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వైద్యాధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 36 మంది ఎంపిక



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కంపెనీల ప్రతినిధులు, కళాశాల సిబ్బంది

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరంలో ఉన్న ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 36 మంది అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌బాబు తెలిపారు. కళాశాలలో డెక్కన్ కెమికల్స్, ఎక్స్–టైల్స్ సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ఈ ఎంపికలకు మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్స్ డిప్లమో అభ్యర్థులు 98 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల చైర్మన్ సీహెచ్ మహందాత నాయుడు అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు రజ్జిత్ సింగ్, సుప్రియ, నేషనల్ కెరియర్స్ సర్వీసెస్ ప్రతినిధి యంగ్ ప్రొఫెషనల్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం రేపు

అగనంపూడి: అగనంపూడి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖకు చెందిన వీ హెల్త్ కేర్ సౌజన్యంతో ఉచిత రక్త పరీక్షలు, ఈసీజీ, చక్కర వ్యాధి పరీక్షలతో పాటు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరాన్ని వాకర్స్‌తో పాటు స్థానికులు వినియోగించుకోవచ్చని వెల్లడించారు. వి హెల్త్‌కేర్ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ నాయక్ (జనరల్ ఫిజీషియన్), డెంటిస్ట్ డాక్టర్ స్వర్ణలత సేవలు అందించనున్నారని ఆయన తెలిపారు.